క్లుప్తంగా

సూక్ష్మ పోషకాలపై అవగాహన ఉండాలి



రెంటచింతల: పంటల సాగుకు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని, సూక్ష్మ పోషకాలపై అవగాహనతో ఎంతో ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లెతే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం అనే సూక్ష్మపోషకాలు, భూమిలో సమపాలలో ఉండేల చూసుకోవడానికి ఈ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. సమావేశంలో వీఏఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



రెంటచింతల: తహసీల్దార్ దొప్పలపూడి మేరీ కనకంను ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షులు, వైఆర్ఎస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యేచూరి వెంకట సైదయ్య మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకట సైదయ్య మాట్లాడుతూ తహసీల్దార్ మేరీ కనకం మండలంలో 2014 నుంచి వీఆర్వోగా, డెప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి మంచి అధికారిగా మండల ప్రజలచే గుర్తింపు పొందినట్లు తెలిపారు. సన్మానించిన వారిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నాళం పెదబాబు, పొట్టిమూర్తి రాంబాబు, ఆకుల నరసింహారావు, కొత్త గోపాలరావు, ఏచూరి మునలయ్య, కొత్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీఎం మోదీ పర్యటన నేపథ్యంలో రహదారి మరమ్మతులు



సత్తెనపల్లి/రాజుపాలెం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన పురస్కరించుకొని విజయపురి సౌత్ నుంచి మాచర్ల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రాజుపాలెం, ధూళిపాళ్ల, సత్తెనపల్లి మీదుగా వెలగపూడి రాజధాని వైపు వెళ్లే వాహనాల రద్దీ దృష్ట్యా కొండమోడు జంక్షన్ నుంచి సత్తెనపల్లి పట్టణం మధ్య గల రోడ్డుకి ఇరువైపుల మార్జిన్‌లో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా సత్తెనపల్లి రూరల్ సీఐ పీ కిరణ్, రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్, నేషనల్ హైవేస్ అథారిటీ ఏఈ ప్రకాశం, తదితరులు మంగళవారం మార్జిన్ రోడ్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అంతేకాక మాచర్ల–గుంటూరు రహదారికి ఇరువైపుల ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

మండల విద్యాశాఖాధికారి శివబాబు

అమరావతి: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఉచిత విద్య అభ్యసించడానికి ఒకటవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి శివబాబు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీ విద్యా హక్కు చట్టం అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పిల్లలకు ఉచితంగా ఇవ్వాలన్నారు. ఇందులో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4, బీసీ, మైనారిటీలకు 6 శాతం, అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం సీట్లు కేటాయించబడతాయన్నారు. ఆధార్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో మే 15వ తేదీ లోపు సమీపంలోని సచివాలయంలో గానీ, మండల విద్యా శాఖ కార్యాలయంలో గానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు జూన్ 2, 2019– మే, 31, 2020 మధ్య జన్మించి ఉండాలన్నారు.

ఆదర్శప్రాయుడు వావిలాల



సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య ఆదర్శప్రాయుడని వావిలాల్ ఇండోర్ స్టేడియం ప్రెసిడెంట్ డాక్టర్ జి.శ్రీధర్ అన్నారు. వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని వావిలాల్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ వావిలాల గోపాలకృష్ణయ్య నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో స్టేడియం సెక్రటరీ ముదినేడి సుబ్బయ్య, కోశాధికారి సూర్యనారాయణ, సభ్యులు రఫీ, హనుమంతరావు, సాంబశివరావు, లతీష్, వెంకట్, చందు, రాంబాబు, తిరుపతి, బ్యాడ్మింటన్ క్రీడా శిక్షణ చిన్నారులు పాల్గొన్నారు.

రైతన్నకు వేసవి దుక్కులతో మేలు

- లోదుక్కులతో భూసారం పెంపు
- భూమి కోతకు గురికాదు.. కలుపు మొక్కల నుంచి రక్షణ
- ఇదే సరైన సమయమంటున్న అధికారులు



వేసవి దుక్కులను ప్రారంభిస్తున్న రైతులు

మాచర్ల రూరల్: పంట కోతలు దాదాపు పూర్తయ్యాయి. వర్షాకాలం వచ్చేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారతాయి. వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలున్నాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు, చీడపీడలు భూమిలో ఉంటాయి. వేరుశనగ, పప్పుశనగ, కంది, మిరప పంటలు వేసినప్పుడు లద్దె పురుగులు భూమిలో ఉండిపోతాయి. ఈ వేసవిలో లోతైన దుక్కులు చేస్తే నేలలో ఉన్న చీడ పురుగులు, గుడ్లు, కోశాలు బయటపడి చనిపోతాయి.

దుక్కులతో ఎంతో ప్రయోజనం..

అన్నదాతకు వేసవి దుక్కులు ఎంతో ప్రయోజకరం. వానా కాలం, వేసవికాలం(ఖరీఫ్, రబీ) పంటలు తరువాత తిరిగి వర్షాకాలం వచ్చే వరకు చాలా మంది రైతులు అవగాహన లేక భూమిని దున్నకుండా అలాగే వదిలివేస్తారు. దీంతో భూమిలో కలుపు మొక్కలు పెరిగి భూమిలోని నీటిని పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేస్తాయి. అదే వేసవిలో లోతు దుక్కులతో సాగు చేస్తే బోలెడు లాభాలున్నాయి. లోతు దుక్కులతో భూమి పై పొరలు కిందకు, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. వర్షాలకు ముందు భూమిని దున్నటం వలన తొలకరి జల్లులు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుంది.

వేసవి వానలతో..

వేసవి కాలంలో కురిసే వానలను రైతులు సద్వినియోగం చేసుకొని మాగాణి, మెట్ట, బీడు భూములను దున్నుకోవాలి. ముఖ్యంగా వేసవి దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. దీని వలన వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహించి నిల్వ చేసుకునే అవకాశం ఉంది. దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, పశువులు, ఆవుల మందలను తోలటం వలన అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ ఎరువులుగా మారుతుంది. సాధారణంగా పంట చేతికి అందగానే పంట నుంచి వచ్చే ఎండుటాకులు, చెత్తా చెదారం కాల్చివేయకుండా అవకాశమున్న వారు లోతు దుక్కులు చేయటంతో నేలలో కలిసిపోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు పంట కోత దశల్లో వాటి నిద్రావస్థ దశల్లో నేల చెత్తా చెదారం కాయ కాడల్లో ఎక్కువ కాలం గడుపుతాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలు భూమిలోపల ఆశ్రయం పొందుతాయి. వేసవి దుక్కుల వలన భూమిలోని చీడపురుగులు, కోశాలు, గుడ్లు, లార్వాలను పక్షులు, కొంగలు తిని నాశనం చేస్తాయి. అదే విధంగా వ్యవసాయ దుక్కుల వలన భూమి లోపలి పొరలు శిలీంద్ర బీజాలు మట్టితో పాటు నేల పైకి వస్తాయి. దీంతో అధిక ఉష్ణోగ్రతతో అవి చనిపోతాయి. దీంతో రైతుకు వేసవి దుక్కులు ఎంతో ప్రయోజనం.

లోతు దుక్కులు చేపట్టాలి

వేసవిలో రైతులు లోతుగా దుక్కులు చేయటంతో వ్యవసాయ భూమి సారవంతంగా మారుతోంది. లోతు దుక్కులపై రైతులకు వ్యవసాయ అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దుక్కుల వలన చీడ పీడల నివారణతో పాటు నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని వేసవిలో దుక్కులు చేపట్టాలి.

– జగదీష్‌రెడ్డి, ఏడీప

ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించండి



కొప్పునూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

మాచర్ల రూరల్: కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షలలో 500 మార్కులు సాధించి పల్నాడు ప్రతిష్ఠను రాష్ట్రవ్యాప్తంగా చాటిన ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని హెచ్ఎం ఐవీ నాగమణి కోరారు. మంగళవారం మండలంలోని కొప్పునూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 598, 596 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మొదటి, రెండు ర్యాంకులలో నిలిచారని, కొప్పునూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సంచుల అజయ్ 548, పందిరి రమ్య 537, కేతుపల్లి ఆకీరానందన్ 533, కాసు సాయి గోపిరెడ్డి 518, కంబాల మణికంఠ 508 మార్కులు సాధించి ప్రతిభను చాటారని చెప్పారు. రూ.లక్షల ఫీజులు చెల్లించిన కార్పొరేట్‌లోనూ ఇలాంటి మార్కులు రాలేదని, తల్లిదండ్రులు ఆర్థిక భారం, ఒత్తిడి లేని, అన్నీ ఉచిత కార్పొరేట్ సౌకర్యాలతో ఉన్న ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించాలని కోరారు. కరపత్రాలు, మైకుల ద్వారా విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోలు, రాజు, అప్పారావు, శ్రీనివాసరావు, పెద యూసఫ్, రామ్మోహన్ నారాయణ, రాచమడుగు ప్రసాద్‌రావు, కమిటీ చైర్మన్ వీరాంజనేయులు, కుమారి, లక్ష్మి, సునీత, గురవారెడ్డి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలి



గురజాల: సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని స్మైల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా కాశీ విశ్వనాథం అన్నారు. స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు స్మైల్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో బండి రవికుమార్ పాల్గొన్నారు.

•అప్రమత్తతే రక్ష



అగ్నిప్రమాదంలో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ప్రమాదాల బారినప్పుడు ప్రాణాలు కాపాడుకునే విషయంలో అవగాహన ఉండాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీధర్ బాబు అన్నారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ టీం మండలంలోని రామాపురంలో మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదవశాత్తు కృష్ణానదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షించే విధానంపై మాక్‌డ్రిల్ అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలు అదుపుచేసే విధానాన్ని చేసి చూపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ కుటుంబరావు, ఎంపీడీఓ పి.రత్నం, డాక్టర్లు సుచరిత, అమూల్య పాల్గొన్నారు.

– దాచేపల్లి



నదిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షిస్తున్న రెస్క్యూ టీం..



ఆపదలో ఉన్న వ్యక్తిని కాపాడుతున్న దృశ్యం..

కల్వర్టులు ఇలా.. మురుగు పారుదల ఎలా..



గంగమ్మ గుడి వెనుక వైపు కల్వర్టు లేకపోవడంతో నిలిచిన మురుగు



హైస్కూల్ వెనుక రహదారి మధ్యలోనే ఏర్పడిన గుంత



గణపతి కాంప్లెక్స్ వెనుక సైడ్ కాలువ లేక మురుగునీరు పారని దృశ్యం

పిడుగురాళ్ల: కల్వర్టులు నిర్మించరూ... సైడ్ డ్రైన్‌లు నిర్మించరూ... మురుగునీరు పారుదల లేక దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పిడుగురాళ్ల పట్టణంలోని హైస్కూల్ వెనుక వైపు రహదారి మధ్యలో గుంత ఏర్పడటంతో అక్కడి ప్రజలు ప్రమాదాలు జరగకుండా ఒక బండను ఏర్పాటు చేశారు. అదే విధంగా గంగమ్మ తల్లి దేవాలయం వెనుక కల్వర్టు లేక అటు వైపు వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. అంతేకాకుండా గణపతి కాంప్లెక్స్ వెనుక సైడ్‌కాలువ లేక మురుగునీరు పారుదల లేక 40, 50 కుటుంబాల వారి నీరు ఎటు పోవాలో అర్థం కాకపోవడంతో రోడ్లపైకి రావటం, లేదా నీరు పారుదల లేక నిల్వ ఉండటం వలన దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ఏపీఓ చిన వెంకటేశ్వర్లు



మల్లవరంలో పంట కాలువ పనులు చేస్తున్న కార్మికులు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధిహామీ పథకం కింద 2025–2026లో గుర్తించిన పనులు ప్రారంభించినట్లు ఉపాధిహామీ పథకం ఏపీఓ జి.చిన వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. పలు గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పంట కాల్వల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. మండలం లోని వివిధ గ్రామాలలో 2025 –2026 సంబంధించి ఉపాధి హామి పథకం కింద రూ.2.96 కోట్లకు విలువైన 196 పనులకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ప్రస్తుతం మల్లవరం, రెంటాల, జెట్టిపాలెం, రెంటచింతల తదితర గ్రామాలలో పెద్ద సంఖ్యలో ఉపాధి పనులకు వస్తున్నట్లు తెలిపారు. 11 గ్రామాలలో మొత్తం 11,800 జాబ్ కార్డులు జారీ చేయగా 19 వేల మంది ఉపాధి పనులకు అవకాశం కల్పించినట్లు దీనిలో 8,669 జాబ్‌కార్డులకు చెందిన 14,376 మంది మాత్రమే ప్రస్తుతం పనులకు వస్తున్నట్లు వెల్లడించారు. కొన్ని గ్రామాలలో మిర్చికోతలు ఉన్న కారణంగా ఉపాధి పనులకు రావడం లేదని రానున్న రోజులలో పనులకు వచ్చే వారి సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెప్పారు. జాబ్‌కార్డు కలిగి ఉపాధి పనిని అడిగిన ప్రతి ఒక్కరికి చూపించాల్సిన బాధ్యత గ్రామాలలో ఎఫ్ఏలదేనన్నారు. ఈ గ్రామాలలో అవసరమైతే మరికొన్ని పనులను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా సమష్టిగా పనిచేయాలి

ఎంపీపీ మేచారపు అనూరాధ



మాట్లాడుతున్న ఎంపీపీ

నకరికల్లు: తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మేచారపు అనూరాధ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ అనురాధ మాట్లాడుతూ గ్రామాల్లో వేసవిలో తలెత్తే సమస్యలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. పలు శాఖల అధికారులు శాఖాపరంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఎంపీడీఓ జి.కాశయ్య మాట్లాడుతూ మండలంలో కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్లు సత్వరమే పంపిణీ చేయాలన్నారు. బోర్లు, బావులకు మరమ్మతులు చేయించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో బీమాకు కూలీలు నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఉపాధి హామీ కూలీ రూ.307కు పెరిగిందని ఎక్కువ మంది ఉపాధి పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రధాని పర్యటన విజయవంతంలో భాగస్వాములు కావాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్ కుమార్ రెడ్డి, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రహదారి ధ్వంసం చేసినా చర్యలు శూన్యం



30వ వార్డులో రహదారి ధ్వంసం చేసి మట్టిపోసిన ప్రాంతం

సత్తెనపల్లి: పట్టణంలోని 30వ వార్డులో త్రికోటేశ్వర వైన్ షాప్‌కి ఎదురుగా రహదారి స్థలం ధ్వంసం చేసినప్పటికీ ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పాలకుల అండదండలు ఉండడంతో అటువైపు కనీసం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని 30వ వార్డు త్రికోటేశ్వర వైన్ షాప్ ఎదురుగా స్థలం కొలత తక్కువగా ఉందని రోడ్డు సగం వరకు ధ్వంసం చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన శాసనసభ్యులు యర్రం వెంకటేశ్వర రెడ్డి, డాక్టర్ కోడెల శివప్రసాదరావులు వావిలాల స్మృతి వనం ఎదురు రోడ్డు విశాలంగా ఉండాలని ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పెద్ద రోడ్డు వేశారు. ఆ తర్వాత వచ్చిన శాసనసభ్యుడు అంబటి రాంబాబు కూడా కొనసాగించారు. కానీ ప్రస్తుత పాలకులు పట్టించుకోక పోవడంతో వారి అండదండలతో ఆ స్థలాన్ని ధ్వంసం చేసి ఆక్రమించుకున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డును ధ్వసం చేసి మూడు రోజులైనా అధికారులు పట్టించుకోక పోవడంతో కేవలం పాలకుల అండదండలతోనే అధికారులు పట్టించుకోవడం లేదనేది తేటతెల్లమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంగతి దేవుడెరుగు చేసిన అభివృద్ధిని ధ్వంసం చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే రోడ్డు విషయంలో పాలకులు, అధికారులు జోక్యం చేసుకోవాలని లేకుంటే భవిష్యత్తులో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ



క్రోసూరు గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలలో విద్యార్థులు

క్రోసూరు: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని తద్వారా అనంతమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి వై.వీరాంజమ్మ కోరారు. మంగళవారం రెండవ రోజు మండల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ దైనందిక జీవితంలో కొంత సమయం గ్రంథాలయంలో గడపాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

అమరావతి: అమరావతి శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరంలో చిత్రలేఖనం, వ్యాసరచన, యోగా, కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లీషు, ఆటపాటలు విద్యార్థులకు నేర్పిస్తామని స్థానిక గ్రంథాలయాధికారి లక్ష్మి తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించటానికి కథలు చెప్పటం, ఆటలు ఆడించడం చేస్తున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



చిత్రలేఖనంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఉచితంగా మజ్జిగ పంపిణీ అభినందనీయం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ నాగమల్లేశ్వరరావు

సత్తెనపల్లి: వేసవి కాలంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయడం అభినందించాల్సిన విషయమని పట్టణ సీఐ ఎస్.నాగమల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ సమీపంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త రామకృష్ణ, దేవరపల్లి కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలుగా జరుగుతున్న మజ్జిగ చలివేంద్రాన్ని మంగళవారం పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు సందర్శించి మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేసి ఎంతో మంది దాహార్తిని తీరుస్తున్నారని, దీనిలో తమను కూడా భాగస్వాములను చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవతి సుబ్బారావు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, సెక్రటరీ దేవరపల్లి కాశీవిశ్వనాథ్, చెక్కా రవికుమార్, స్వామి ప్రసాద్, దేవరపల్లి రాఘవ, తేజ ఉన్నారు.

•నేడు గంగా పార్వతి సమేత నగరేశ్వరుని కళ్యాణం

ముప్పాళ్ళ: మండలంలోని కుందురువారి పాలెం గ్రామంలో వేంచేసియున్న వాసవి కన్యకాపరమేశ్వరి నగరేశ్వరి స్వామి దేవస్థానంలో గంగా పార్వతి సమేత నగరేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం ఈ నెల 30వ తేదీన జరుగుతుందని దేవస్థానం అధ్యక్షుడు చిలకల సాంబశివరావు మంగళవారం తెలిపారు.